రుస్తుందాదా చేతిలోని కాగితం తీసుకుని అందులో రాసి వున్న అడ్రస్ చూసి కెవ్వుమని అరవబోయిన బుచ్చిబాబు చేత్తో గట్టిగా నోరు మూసుకుని రెండు క్షణాల తర్వాత నోటి మీద నుండి చెయ్యి తీసేసి " నా.... నా..... నాకు కూడా ఇదెక్కడుందో తెలీదు. నేను కూడా ఊరికి కొత్త" అన్నాడు గబుక్కున అడ్రస్ కాగితం రుస్తుందాదాకి ఇచ్చేస్తూ.

రుస్తుందాదా భారంగా అడుగులు ముందుకు వేస్తూ తనలో తను అనుకుంటున్నట్లు అన్నాడు "నీయబ్బ....ఈయాల వీడి అడ్రస్ కనుక్కోవాల్సిందే. సఫా చేయాల్సిందే"

ఆ మాటలు బుచ్చిబాబు చెవిన పడనే పడ్డాయి. బుచ్చిబాబు గడగడా వణికిపోయాడు.

వణికే చేతులతో గది తాళం తీసాడు. ఇద్దరూ గదిలోకి వెళ్ళాక గది తలుపులు గడియలేసి కెవ్వుమని అరిచాడు బుచ్చిబాబు.

"ఏంటి? ఏమైంది?" కంగారుగా అడిగింది సీత .

"ఇందాక వాడి ముందు అరిస్తే వాడికంతా తెలిసిపోతుందని బలవంతంగా కేకని ఆపుకున్నా వాడెవడో తెల్సా. రుస్తుందాదా అని ఒక భయంకరమైన కిరాయి హంతకుడు. ఈ వేళ న్యూస్ పేపర్లో వాడి గురించి రాసారు...." అన్నాడు బుచ్చిబాబు పాలిపోయిన మొహంతో.

"అయితే నీకేందుకు భయం?"

"వాడు అడిగింది నా అడ్రస్ గురించే. వాడు నాకోసం ఎందుకు అడుగుతున్నాడో, మావాళ్ళు ఇంటికి రాకుండ హోటల్లో ఎందుకు దిగారో నాకంత అయోమయగా వుంది బాబోయ్" జుట్టు పీక్కుంటూ బాధగా అరిచాడు బుచ్చిబాబు .

"అసలు రుస్తుందాదాకి నీ మీద పగ ఎందుకుంటుంది?" అడిగింది సీత .

"వాడికి నా మీద పగ ఉండకపోవచ్చు. ఇందాక చూసావుగా, నేనెవరో కూడా వాడికి తెలీదు. వాడు కిరాయి హంతకుడు కదా....ఎవరయినా వాడిని నియమించారేమో."

"నీ మీద కిరాయి హంతకుడిని ప్రయోగించేంత పగ ఎవరికి వుంటుంది?"

"ఏమో బాబోయ్....." బుచ్చిబాబు తలకాయ్‌ని రెండు చేతులతో పట్టుకున్నాడు.

0 0 0

పర్వతాలరావు పార్వతమ్మ బుచ్చిబాబు ఇంటిముందు ఆటోలోంచి దిగారు.

"అరె....ఇంటికి తాళం వేసుందే? కొంపదీసి ఈ అడ్డగాడిదేమైనా క్యాంప్‌కి వెళ్ళాడేమో?" అన్నాడు పర్వతాలరావు .

"హయ్యో! ఇప్పుడెలాగండీ పాపం?" అడిగింది పార్వతమ్మ .

పర్వతాలరావు ఏదో అనేంతలో ప్రక్కింటి అమ్మాయ్ పరిగెత్తుకు వచ్చింది.

ఆ అమ్మాయికి పన్నెండేళ్ళు వుంటాయి.

"మీరు బుచ్చిబాబు అంకుల్ పేరెంట్సాండీ?" పర్వతాలరావుని అడిగింది అ అమ్మాయి.

"అవునుగానీ మా వెధవాయ్‌గానీ ఊరెళ్ళాడా?" అడిగాడు పర్వతాలరావు .

"లేదనుకుంటానండీ.....ఊళ్ళోనే వున్నట్టున్నారు. రాత్రి ఆంటీ అంకుల్ బయటికి

వెళ్ళారు. మళ్లీ తెల్లారి అంకుల్ ఒక్కరే ఇంటికి వచ్చి మళ్ళీ ఎనిమిది గంటలకి బయటకి వెళ్ళారు" చెప్పిందా అమ్మాయి.

"ఆంటీ ఎవరు?" ఆశ్చర్యంగా అడిగింది పార్వతమ్మ .

"మీ కోడలు ఆంటీ....ఇంక వేరే ఆంటీ ఎవరుంటారు?" అంత కంటే ఆశ్చర్యంగా అడిగింది ఆ అమ్మాయి.

"కోడలా? హవ్వ హవ్వ హవ్వ" నోటి మీద కొట్టుకుంది పార్వతమ్మ.

"ఇంక చాల్లే ఆపు. మరికాసేపు అలా కొట్టుకున్నావంటే మూతి వాచిపోయి సుగ్రీవుడి చెల్లెల్లా తయారవుతావ్" పెళ్ళాం మీద విసుక్కున్నాడు పర్వతాలరావు .

"ఇంటివి డూప్లికెట్ కీస్ వున్నాయి. ఇమ్మంటరా అంకుల్?" అడిగింది ఆ అమ్మాయి.

"వద్దులే! ఒకవేళ మా పింజారీ వెధవస్తే మేం వచ్చి వెళ్ళినట్టు చెప్పకు."

ఆ అమ్మాయికి చెప్పేసి ఆటో ఎక్కేసాడు పర్వతాలరావు , పార్వతమ్మ కూడా ఆటో ఎక్కి ఆయన ప్రక్కన కూర్చుంది.

"యాడికి సార్?" అడిగాడు ఆటోవాడు.

"మళ్లీ వెనక్కి.... హోటల్‌కి" చెప్పాడు పర్వతాలరావు .

ఆటో ముందుకు కదిలింది.

"చుసావా? మనకి తెలీయకుండానే మనకో కోడలు పిల్ల వుంది" భార్యతో వ్యంగ్యంగా అన్నాడు పర్వతాలరావు.

పార్వతమ్మ నోట్లో కొంగును దోపుకుంది.

"నేను చెప్పలేదు ఇక్కడ ఇలాంటి గందరగోళం ఏదో జరుగుతుందనీ?"

పార్వతమ్మ చీర కొంగును మరింత లోపలికి దోపేసుకుంటూ"ఉహూ......ఊహూ........... ఊహూ.........." అంది.

'నీకు చీర కొంగు వుంది కాబట్టి చక్కగా నోట్లో దోపుకుని ఏడుస్తున్నావు. నేనేది దోపుకుని ఏడ్చేది? ఇంక చాల్లే ఆపు" విసుక్కున్నాడు పర్వతాలరావు.

ఆ ఆటోకి కాస్త దూరంలో వీళ్ళని ఫాలో అవుతూ మొటార్ సైకిల్‌మీద ఇనస్పెక్టర్ యాదగిరి, అతని వెనకాల కానిస్టేబుల్.

"అయితే మనం వీళ్లని ఫాలో అయితే సీత ఎక్కడుందో తెలుస్తుందంటారా సార్?" కానిస్టేబుల్ యాదగిరిని ఆదిగాదు.

"జరూర్ తెలుస్తుంది. పిచ్చికుక్కలెక్క ఆటోల అటూ ఇటూ గిట్ల తిర్గుతుండ్రో సూసినవ్ కద...ఏదో కిర్‌కిర్ అయితే వున్నది" అన్నాడు ఇనస్పెక్టర్ యాదగిరి.

0 0 0

బుచ్చిబాబు ఇంటిముందు మళ్లీ మరో ఆటో ఆగింది!

అందులోంచి పోనీటెయిల్ ఊగించుకుంటూ సుందర్ దిగాడు.

"జాలీ...మై డార్లింగు జూలీ....అహహహ ...." గుండెలు బాదుకుంటూ ఏడుస్తూ ఇంటివైపు చూశాడు సుదర్. తలుపులకి వేసివున్న తాళం అతనికంట పడింది.

"ఓ మైగాడ్..... బుష్షీ నువ్వు ఎచ్చటికి పోయావు బుష్షీ?" బాధగా పోనీటేయిల్ పట్టి లాక్కున్నాడు సుందర్. అతని కళ్లకి పక్కింటి వరండాలో ఆడుకుంటున్న అమ్మాయి కనిపించింది.

"హే పాపాయ్" అంటూ పిలిచాడు సుందర్.

ఆ అమ్మాయి పరుగెత్తుకు వచ్చింది.

"బుష్షీబాబు ఎచట? ఉరు వెళ్ళినాడా?" అడిగాడు సుందర్.

"లేదంకుల్ ఊళ్ళోనే వున్నాడుగానీ ఇక్కడ ఉండడం లేదేమో ఆంటీని తీసుకుని సూట్‌కేసుతో సహా నిన్నరాత్రే వెళ్ళాడు?" చెప్పింది అ అమ్మాయి.

"ఏచ్చటికి వెళ్ళినాడు?"

"ఏమో తెలీదు అంకుల్" అని చెప్పి పరుగెత్తుకుపోయింది.....ఆ అమ్మాయి.

"హా బుష్షీ సమయానికి నువ్వు కూడా లేవా?" గుండేలు బాదుకున్నాడు సుందర్.

అప్పుడే మరో ఆటోలో రాధ అక్కడికి వచ్చింది.

"ఓ మీరు వష్షినారా?" అని రాధకి బుచ్చిబాబు లేని సంగతి చెప్పాడు సుందర్!

"అరె....ఇప్పుడెలా?" అంది రాధ.

"మనము హోటల్ నందు దిగి వారు కనిపించువరకు వెయిట్ సేయ్యాలి"అన్నాడు సుందర్.

"ఆడదాన్ని నేను వంటరిగా హోటల్ రూంలో ఎలా వుంటాను?"

"ఏమియు ఫరవాలేదు. నేను మీప్రక్క రూంనందు రూం టిష్కుదును" అన్నాడు సుందర్,

అక్కడున్న రెండు ఆటోల్లో ఒక ఆటోని పంపించేసి ఇదరూ ఒక ఆటో ఎక్కారు.

"ఎక్కడికి వెళ్ళాలి సార్?" అడిగాడు ఆటోవాడు.

"ఈ ఊరునందు మంషి హోటల్ ఏది?" అడిగాడు సుందర్.

"హోటల్ రంభ సార్"

"షరే..... రంభ దగ్గరకు పోనీ........" ఆటో ముందుకు కదిలింది.

ఆటో ఫర్లాంగుదూరం నడిచాక సుందర్‌కి ఏదో గుర్తు వచ్చింది.

"ఓ జూలీ....." గుండెలు బాదుకుంటూ ఏడ్చాడు సుందర్.

"జూలీకేమయింది?" అడిగింది రాధ కంగారుగా.

"ఆమెకు ఏమి కాలేదు. నాకే అయినది! హ జూలీ!" మళ్లీ గుండెలు బాదుకున్నాడు సుందర్.

0 0 0

ఏకాంబరం గోడగడియారంవంక చూసాడు సమయం పదకొండు గంటలయింది|. తను

చిరాకుగా బెల్ మోగించాడు. క్షణాల్లో ప్యూన్ లోపలికి వచ్చాడు.

ప్యూన్ గబగబా బయటికివెళ్ళి గోడకి కొట్టిన బంతిలా వెంటనే వెనక్కి వచ్చాడు. "సార్....వాళ్లు రాలేదు సార్" అని చెప్పాడు.

"హు....।అయితే ఇద్దరు కలిసి ఆఫీసు ఎగ్గొట్టి హాయిగా ఎంజాయ్ చేస్తున్నారన్నమాట" పళ్ళు నూరాడు ఏకాంబరం.

ఇంతలో రుస్తుం దాదా రివ్వుమని క్యాబిన్‌లోకి దూసుకువచ్చాడు.

"ఏయ్ ఎవరు నువ్వు?" కోపంగా అరిచాడు ఏకాంబరం .

"ఈ రుస్తుం దాదాని ఎవరు నువ్వు అని ఇప్పటిదాకా అడిగినవాళ్ళే లేరు" అన్నాడు మీసాలు మెలేస్తూ రుస్తుందాదా.

ఏకాంబరం కూడా ఆ రోజు ఉదయమే రుస్తుందాదా గురించి న్యూస్ పేపర్‌లో చదివాడు. అవును ఆ ఫోటోలోని వ్యక్తి.

"కెవ్వ్...." భయంకరంగా అరిచాడు ఏకాంబరం.

"రుస్తుందాదా గారూ ఇలా వచ్చారేంటి?" చేతులు నలుపుకుంటూ అడిగాడు ఏకాంబరం .

" బుచ్చిబాబు గాడు ఈవేళ ఆఫీసుకు రాలేదటగా నాకు వాడి ఫోటోకావాలి " అడిగాడు రుస్తుందాదా.

"అతని ఫోటో ఎందుకూ? ఇంటికెళితే డైరక్టుగా అతన్నే చూడొచ్చుగా భయం భయంగా అడిగాడు ఏకాంబరం.

"ఇప్పుడే వాడి ఇంటినుండీ వచ్చా....ఇల్లు తాళం పెట్టి వుంది. వాడెలా వుంటాడో తెలీదు. నువ్వు ఫోటో ఇస్తే వాడి సంగతి చూస్తా...."

"కానీ అతని ఫోటో మా దగ్గర లేదే!" బుర్ర గోక్కున్నాడు ఏకాంబరం.

రుస్తుందాదా జేబులోంచి కత్తితీసి ఏకాంబరం పీకమీద పెట్టాడు.

"ఆ....ఆ...వుంది. అతని పర్సనల్ ఫైల్‌లో వుంది. నువ్వు కంగారుపడి పొడిచేయకు బాబూ!" వణికిపోతూ అన్నాడు ఏకాంబరం.

ప్యూన్ అక్కడే వున్న ఫైళ్ళ ర్యాంక్‌లోంచి బుచ్చిబాబు పర్సనల్ ఫైల్ చటుక్కున తీసి దాంట్లోంచి అతని ఫోటో పీకి రుస్తుందాదా చేతిలో పెట్టాడు.

ఆ ఫోటోని చూస్తూనే రుస్తుందాదా కెవ్వుమని అరిచాడు.

"హ్రరే....పొద్దున్న వీడి అడ్రస్ వీడినే అడిగాను"

పిడికిలి బిగించి నెత్తిమీద బాధగా కొట్టుకున్నాడు రుస్తుందాదా.

0 0 0

"మనం ఈ టెన్షన్‌తో ఈ గదిలో ఇలానే వుంటే నాకు చాలా బోర్ కొడుతుంది" అంది సీత.

“అయితే నన్నేం చేయమంటావ్?” విసుగును అణుచుకుంటూ అన్నాడు బుచ్చిబాబు .

“క్రిందకివెళ్ళి మ్యాగజైన్స్ తీసుకురా”

“అమ్మో...ఇంకేమయినా వుందా? మా అమ్మా నాన్నా నన్నిక్కడ చూస్తేనో? అంతేకాదు.... ఆ రుస్తుందాదాగాడు నా కోసం వెతుకుతున్నాడు. వీడు వెతుకుతున్నది నా గురించేని తెలిస్తే ఇంకేమయినా వుందా?”

“అయితే నేనే క్రిందకి వెళ్లి తెచ్చుకుంటా!”

బుచ్చిబాబుకి సమాధానం చెప్పకుండా రూంలోంచి బయటికి వెళ్ళి పోయింది సీత .

0 0 0

“ఏంటోనయ్యా నాకేదో భయంగా వుంది. ఆ హంతకుడు బుచ్చిబాబు కోసం ఎందుకు వెతుకుతున్నాడో ఏంటో... బుచ్చిబాబు ఏదో ప్రమాదంలో వున్నాడు అందుకే ఆఫీసుకు రాలేదేమో!” నెత్తిన చెయ్యి పెట్టుకుని బాధగ అన్నాడు ఏకాంబరం నవీన్‌తో.

“మనం ఎలాగైనా ఈ విషయం అతనికి చెప్పాలి సార్!” అన్నాడు నవీన్.

“ఎలా చెపుతాం? అతనెక్కడున్నడో మనకి తెలిస్తే కదా”

అక్కడే వున్న టైపిస్టు నోరు విప్పాడు.

“పొద్దున నేను టిఫిన్ చెయ్యడానికి హోటల్ రంభకి వెళ్ళాను సార్. అక్కడ బుచ్చిబాబునీ, సీతని చూసాను. బహుశా వాళ్ళు ఆ హోటల్లోనే తల దాచుకుని వుంటారు సార్”.

“హబ్బా! నువ్వు భలేవాడివయ్యా ఇందాకట్నుంచీ మేము టెన్షన్‌తో చస్తుంటే ఇప్పుడా అ విషయం చెప్పడం? నేనిప్పుడు వెంటనే హోటల్ రంభ దగ్గరికి వెళ్ళాలి. పాపం సీతకి ఏం ప్రమాదం ముంచుకోస్తుందో ఏమో.....”

“రుస్తుందాదా వెతుకుతున్నది బుచ్చిబాబు కోసం సార్...ప్రమాదంలో వున్నది బుచ్చిబాబు సార్”

“తెల్సులేవోయ్ డవ్వాలడివ్వి! బుచ్చిబాబు వెంటే సీత వుంది కదా. ఆమెకి ఏమయినాకీడు చేస్తాడేమో అ రుస్తుం కిత్తిగాడు. బాబోయ్ మీతో మాట్లాడుతూ వుంటే అక్కడ కోంపలు మినిగిపోతాయ్” అంటూ క్యాబిన్‌నోంచి బయటకే పరుగుతీసాడు ఏకాంబరం .

0 0 0

హోటల్‌ని ఆనుకుని వున్న పుస్తకాల షాప్ దగ్గర వీక్లీలు కొనుక్కుంది సీత .

“ఎంత” అడిగింది షాపువాడిని.

“ఇరవై రూపాయలు” చెప్పాడు షాపువాడు.

సీత డబ్బులు చెల్లిచి రెండడుగులు వేసిందో లేదో “సీతా...” అన్న పిలుపు వినిపించి

వెనక్కి తిరిగి చూసింది సీత.

రాధ! ప్రక్కనే సుందర్.

"రాధా!" ఆనందంగా అంది సీత.

రాధా, సుందర్ ఆమెని సమీపించారు.

"అదేమిటి నన్ను రమ్మని ఫోన్ చేసి నువ్వు ఇంటికి తాళం వేసుకుని తిరుగుతున్నావు?" అడిగింది రాధ.

"నువ్వు ఇంత త్వరగా ఇక్కడికి వస్తావని అనుకోలేదు. ఇప్పుడు అనుకోని పరిస్థితుల్లో నేను బుచ్చిబాబూ ఈ హోటల్లో వచ్చిదిగాం" చెప్పింది సీత .

"ఈ హోటల్లో దిగారా? ఎందుకూ?" ఆశ్చర్యంగా అడిగింది రాధ.

"నా రూంలో చెపుతాను. సరేగానీ మీరిద్దరూ కలిసి ఇక్కడికి రావడం చాలా విచిత్రంగా వుంది.

"ఇద్దరం కలిసి రాలేదు. విడివిడిగా వచ్చి మీ ఇంటిదగ్గర కలిశాం".

"ఏంటడీ సుందర్ గారు! ఎలా వున్నారు?" అడిగింది సీత .

"జూలీ! అహోహ్ ...." గుండెలు బాదుకుంటూ ఎడ్చాడు సుందరం.

"ఏంటీ? జూలీ చచ్చిపోయిందా?" కంగారుగా అడిగింది సీత.

"కాదు. జూలీ ఎవరో రాబర్ట్‌తో వెళ్ళిపోయిందిట. అమెరికా నుండి ఇన్‌ఫర్మేషన్ వచ్చింది".

"ఓ...జూలీ హి హి హి " బాధగా పోనీటెయిల్ పీక్కున్నాడు సుందర్.

"మనం రూంలోకి వెళ్ళి మాట్లాడుకుందాం రండి..." అంది సీత .

నలుగురూ నాలుగడుగులు వేసారో లేదో వెనుకనుంది ఆడగొంతు పిలుపు.

"అమ్మాయ్ సీతా"

నలుగురూ వెనక్కి తిరిగారు.

కాస్త దూరంలో  పర్వతాలరావు, పార్వతమ్మ! ఇద్దరూ వేగంగా వీరివేపే రాసాగారు.

"వాళ్ళెవరు?" అడిగింది రాధ.

"బుచ్చిబాబు అమ్మానాన్నా. వీళ్ళ గురించే మేము హోటల్‌లో దిగాం. అనుకోకుండా వీళ్ళుకూడా ఈ హోటల్‌లోనే దిగారు" చెప్పింది సీత.

పర్వతాలరావు, పార్వతమ్మ ఇద్దరూ వాళ్ళని సమీపించారు.

"ఏంటమ్మా సీతా నువ్విక్కడ వున్నావు? పొద్దున్న పోలీసులు నువ్వు తప్పిపోయావని చెప్పారే!" అడిగాడు పర్వతాలరావు.

సీత సందేహంగా చూసింది.

"ఇంకా ఆలోచిస్తావేంటి సీతా .... జరిగిందంతా చెప్పు! వాళ్ళ అబ్బాయ్ నిర్వాకం గురించి తెలిసి సంతోషిస్తారు" అంది రాధ.

“మా రూంకి వెళ్ళి మాట్లాడుకుందాం రండి” అన్నాడు పర్వతాలరావు.